# భయం వద్దు...

# ఆక్సిజన్, రెమిడెసివిర్ కు కొరత లేదు...

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి(వైద్య ఆరోగ్య శాఖ) ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని)
- 37 వేల బెడ్లు సిద్ధం చేస్తున్నాం
- 62 లక్షల మందికి వ్యాక్సిన్లు వేశాం
- ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు
- నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠిన చర్యలు : డిప్యూటీ సీఎం హెచ్చరిక

సచివాలయం, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో ఆక్సిజన్, రెమిడెసివిర్ ఇంజక్షన్ల కొరత లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి(వైద్య ఆరోగ్య శాఖ) ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో 37 వేల బెడ్లు సిద్ధం చేస్తున్నామన్నారు. నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 62 లక్షల మందికి వ్యాక్సిన్ అందజేశామన్నారు. కరోనా నియంత్రణకు ఏర్పాటైన అయిదుగురు మంత్రుల ఉప సంఘం సమావేశం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో బుధవారం జరిగింది. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మాట్లాడారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కమిటీ... కరోనా నియంత్రణ కార్యక్రమాల తీరుతెన్నులు, ప్రస్తుత కొవిడ్ పరిస్థితులపై కులంకషంగా చర్చించిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్నకొవిడ్ టెస్టులపైనా చర్చించామన్నారు. ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య పెంపుపైనా, కొవిడ్ కేర్ సెంటర్లలో సౌకర్యాల అమలు తీరుపైనా, డాక్టర్ల పర్యవేక్షణపైనా సమావేశంలో సమీక్షించామన్నారు. కొవిడ్ కేర్ సెంటర్లలో నాణ్యమైన ఆహారం అందివ్వడంతో పాటు ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉన్నాయా..? 104 వ్యవస్థ పని చేస్తుందా...? వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. కరోనా మరణాలు లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టడమే సీఎం జగన్మోహన్ రెడ్డి

లక్ష్యమన్నారు. కరోనా నియంత్రణకు సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిరోజూ తమతోనూ, అధికారులతోనూ సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యం నెరవేర్చడానికి అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

### 37 వేల బెడ్లు సిద్ధం చేస్తున్నాం...

రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో బెడ్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఈ అంశంపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 60 వరకూ కొవిడ్ సెంటర్లు ఉన్నాయన్నారు. కరోనా బాధితుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 37 వేల బెడ్లు సిద్ధం చేస్తున్నామన్నారు.కరోనా లక్షణాలు తీవ్రంగా ఉన్నవారికి ఆసుపత్రుల్లోనూ, తక్కువ లక్షణాలు ఉన్నవారికి కొవిడ్ కేర్ సెంటర్లలోనూ చికిత్సలు అందజేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశించారన్నారు. కొవిడ్ సెంటర్లలో అవసరమైన వైద్య సిబ్బంది ఏర్పాటుతో పాటు శానిటైజేషన్, మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో బెడ్లు పెంపునకు అనుమతిలిస్తున్నామన్నారు.

### ఆక్సిజన్, రెమిడెసివిర్ ఇంజక్షన్ల కొరత లేదు...

రాష్ట్రంలో ఆక్సిజన్, రెమిడెసివిర్ ఇంజక్షన్ల కొరత లేదని, అసవరమైన మేరకు వాటి నిల్వలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని స్పష్టం చేశారు. గతంలో 240 మెట్రిక్ టన్నుల ఉపయోగం ఉండేదన్నారు. ప్రస్తుతం కరోనా వ్యాప్తి కారణంగా ఆక్సిజన్ డిమాండ్ పెరిగిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 420 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ కేటాయించిందన్నారు. కేంద్రం కేటాయించిన నిల్వలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు రెమిడెసివిర్ ఇంజక్షన్లను ప్రభుత్వమే సరఫరా చేస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రులు, నెట్ వర్క్ ఆసుపత్రుల్లో రెమిడెసివిర్, ఆక్సిజన్, ఇతర మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెమిడిసివిర్ ఇంజక్షన్లను బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా అడ్డుకోవడంతో పాటు వినియోగంలో అక్రమాలను అడ్డుకోడానికి జిల్లా స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

### నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠిన చర్యలు....

వైద్యులు, సిబ్బంది తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని కొనియాడారు. ఆసుపత్రులు, కొవిడ్ కేర్ సెంటర్లలో కరోనా బాధితులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఇళ్లకు చేర్చడమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. సీఎం లక్ష్యం నేరవేర్చడానికి వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఫ్రంట్ లైన్ వారియర్స్, కరోనా వారియర్స్ కు ఏ చిన్న సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజలకు భయం వద్దు...**

ప్రజలు భయాందోళను చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో కరోనా నియంత్రణకు సీఎం జగన్మోహన్ రెడ్డి నిరంతరం అప్రమత్తంతో వ్యవహరిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సీఎం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకారమందించాలని కోరారు. ప్రతి రోజూ అధికారులతోనూ, తమతోనూ సమీక్షలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కరోనా మేనేజ్ మెంట్ పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. కరోనా పేషంట్లను తరలించడానికి 108 వాహనాలను వినియోగిస్తున్నామన్నారు. కరోనా బాధితుల ఇబ్బందులను 104 ఫోన్ ద్వారా సేకరించి పరిష్కరిస్తున్నామన్నారు. విశాఖలో జరిగిన సంఘటనపై కమిటీ వేశామని, ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకూ 62 లక్షల మందికి వ్యాక్సినేషన్ వేశామన్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన వ్యాక్సిన్ ను వెంటనే ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల సేవలను కూడా వినియోగించుకుంటున్నామన్నారు. నిన్న(27.4.2021) వచ్చిన లక్ష డోసులను తక్షణమే ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా వ్యాక్సినేషన్ డోసులు పంపించాలని ఇప్పటికే సీఎం జగన్మోహన్ రెడ్డి కేంద్రాన్ని కోరారని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు.

అంతకుముందు మంత్రుల సబ్ కమిటీ సమావేశం... డిప్యూటీ సీఎం, ఆ కమిటీ కన్వీనర్ ఆళ్ల నాని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, మేకతోటి సుచరిత, సీదిరి అప్పలరాజుతో పాటు ప్రజా వ్యవహారాల సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, డీజీపీ గౌతమ్ సవాంగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గమనిక : ఫొటోలు ఉన్నాయి...**

***జారీచేసిన వారు : పబ్లిసిటీ సెల్, I&PR, సచివాలయం, అమరావతి.***